క్లుప్తంగా

కాంట్రాక్ట్ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమలాయపాలెం: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాల (బాలుర) తిరుమలాయపాలెంలో ఖాళీగా ఉన్న పీజీటీ ఫిజికల్ సైన్స్ పోస్టుకు తాత్కాలిక ప్రతిపాదికన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.పుల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ(భౌతిక శాస్త్రం), బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఆర్‌సీఓ కార్యాలయం ఐటీడీఏ భద్రాచలంలో సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ నెల 19 సాయంత్రం 5 గంటల కల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డెమో ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనుండగా.. పూర్తి వివరాల కోసం సెల్. 83339 25402 సంప్రదించవచ్చని చెప్పారు.

తహసీల్దార్‌కు వినతి

రఘునాథపాలెం: మండల పరిధిలోని పుటానితండా గ్రామ పంచాయతీ సమీపంలో గల ఈర్లపూడి రెవెన్యూ పరిధిలో కుక్కల గుట్ట భూములను తక్షణమే సర్వే నిర్వహించి, రైతులకు న్యాయం చేయాలని శుక్రవారం పుటాని తండా గ్రామస్తులు తహసీల్దార్ విల్సన్ బెన్నికు వినతి పత్రం అందజేశారు. కొంతమంది తప్పుడు సర్వే నంబర్లు ద్వారా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, సర్వే నంబర్ మొత్తాన్ని సర్వే చేయించి భూమి హద్దులు తీసి, రైతులకు న్యాయం చేయాలని రైతులు వినతిలో పేర్కొన్నారు.

సెన్సార్ బోర్డు సభ్యుడిగా ఉదయ్‌ప్రతాప్


ఉదయ్‌ప్రతాప్

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్, ఖమ్మంకు చెందిన సన్నె ఉదయ్‌ప్రతాప్ దక్షిణ భారత సెన్సార్ బోర్డు సభ్యుడిగా రెండోసారి నియమితులయ్యారు. శుక్రవారం ఈమేరకు భారత ప్రభుత్వ శాఖ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ బాధ్యులు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌ప్రతాప్ మాట్లాడుతూ.. మొదటిసారి సెన్సార్ బోర్డులో తన సేవలకు గుర్తించి రెండోసారి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపాక పలువురు అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: మహాజన సోషలిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కమిటీని శుక్రవారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.అంజయ్య, ఉపాధ్యక్షులుగా ఈదయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులుగా హనుమంతరావు, నాగభూషణం, నరసింహారావు, వెంకటేశ్వర్లు, ప్రకాశ్, కార్యదర్శులుగా వెంకట్రావు, జనార్దన్, వెంకన్న, ముకేశ్, ప్రచార కార్యదర్శులుగా ముత్తారావు, సహాయ కార్యదర్శులుగా కోటి, వెంకటరత్నం, నాగేశవవు, వీరస్వామి, చిన్న సైదులను ఎన్నికయ్యారు.

ఘనంగా 'రెజొనెన్స్ ఇన్ఫో' వన సమారాధన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాల విద్యార్థులు కార్తీక మాసం సందర్భంగా వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో శుక్రవారం వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు నీలిమ, ఆర్‌వీ నాగేంద్రకుమార్, శ్రీధర్‌రావులు మాట్లాడగా.. విద్యార్థులు ఆటపాటలతో కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నేలకొండపల్లి: మండలంలోని సదాశివపురానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన వ్యక్తి(30) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా.. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కవిరాజ్‌నగర్‌లోని రాఘవేంద్ర ఫిల్లింగ్ స్టేషన్‌లో శుక్రవారం సోమాజీగూడ యశోద ఆస్పత్రి, మ్యాక్సివిజన్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రుల ఆధ్వర్యాన 2డీఎకో, ఈసీజీ, బీపీ, జీఆర్‌బీఎస్, కంటి చికిత్సలకు సంబంధించిన పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిల్లింగ్ స్టేషన్ బాధ్యులు ఈటూరి అనంత పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సంతాపం

ఖమ్మం సహకారనగర్: ఉభయ గోదావరి జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మరణంపై తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్)జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావులు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సాబ్జి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా పని చేశారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ తరఫున పోటీ చేసి విజయం సాధించారన్నారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు బుర్రి వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, రంజాన్ తదితరులు ఉన్నారు.

ప్రాంగణంపై పట్టింపేది?


రోటరీనగర్‌లో మూతబడిన పట్టణ వీధి వ్యాపారుల సముదాయం

మూతపడిన రోటరీనగర్ వీధి వ్యాపారుల ప్రాంగణం

- రూ.40 లక్షలతో రెండేళ్ల క్రితం నిర్మించిన సముదాయం
- సామర్థ్యానికి మించి వ్యాపారులను అనుమతించడంతో ఘర్షణలు
- కన్నెత్తి చూడని కొనుగోలుదారులు
- నిర్మానుష్యంగా మారిన విలువైన ప్రాంతం


రోటరీనగర్‌లోని కుక్కల సంరక్షణ కేంద్రం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 9వ డివిజన్ రోటరీనగర్‌లో గత రెండేళ్ల క్రితం నిర్మించి ప్రారంభించిన పట్టణ వీధి వ్యాపారుల ప్రాంగణం నేడు పనికి రాకుండాపోయింది. కనీసం నలుగురికి ఉపయోగం లేకుండా చెత్త నిల్వలతో కంపు కొడుతూ.. మూత్ర విసర్జనలకు అడ్డాగా మారింది. దీంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కాగా, నగరంలో వీధుల వెంట వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులందరూ ఒకే చోట వ్యాపారం చేసుకోవాలనే ఉద్దేశంతో గత రెండేళ్ల క్రితం రోటరీనగర్‌లోని పాత ఖమ్మం అర్బన్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో రూ.37 లక్షలకు పైచిలుకు ఖర్చుతో వీధి వ్యాపారుల ప్రాంగణం నిర్మించారు. ఇందులో 20 నుంచి 25 మంది వరకు అమ్మకాలు కొనసాగించేందుకు అనువుగా రెండువైపుల షెడ్లులు, వాటికి ప్లాట్లు ఫారంలు ఏర్పాటు చేశారు. కానీ అధికారులు దాన్ని పట్టించుకోకుండా వ్యాపారులందరూ ప్రాంగణంలో అమ్మకాలు చేసుకోవచ్చని చెప్పడంతో ప్రారంభంలోనే వ్యాపారులు పోటీ పడాల్సి వచ్చింది.

ఘర్షణలకు నెలవుగా..

అక్కడ అత్యధికంగా కూరగాయాల అమ్మకాలకు అనువుగా ఉంటుంది. వ్యాపారులు పోటీ పడటం, నాణ్యమైన కూరగాయలు రాకపోవడం తదితర కారణాలతో ఆ దుకాణాల వైపు రావడానికి కొనుగోలుదారులు అంతగా ఉత్సాహం చూపించలేదు. దీంతో ఆరంభంలో కళకళలాడిన ప్రాంగణం తర్వాత వెలవెలబోయింది.స్లాళ్ల కేటాయింపు లేకపోవడంతో వ్యాపారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకునేవి. ఈ విషయంలో అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో రూ.40 లక్షలు ఖర్చు చేసినా.. ప్రస్తుతం నలుగురుకి కూడా ఉపయోగం లేకుండా చెత్త నిల్వలతో మురుగుమయంగా మారింది. అంతేకాక రాకపోకలు సాగించే వారికి బహిరంగ మూత్రశాలగా తయారైంది.

జనావాసాల మధ్య కుక్కల సంరక్షణ కేంద్రం..

నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కుక్కలను సంరక్షించాలనే ఉద్దేశంతో స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయ భవనంలో కుక్కల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇది జనావాసాల మధ్య ఉండడంతో నిత్యం కుక్కలతో నరకం చూస్తున్నామని, దీనికి తోడు వీధి వ్యాపారులకు కోసం అంటూ నిర్మాణం చేసి ఉపయోగంలో లేకుండా విలువైన ప్రాంతంలో నిర్మానుష్యంగా మార్చడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకొని జనావాసాల మధ్య కుక్కల నిలయం లేకుండా చేయడంతో పాటు మూతపడిన వీధి వ్యాపారుల సముదాయాన్ని తెరిపించి ప్రాంత ప్రజలకు ఉపయోపడేలా చర్యలు తీసుకోవాలని లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మళ్లీ మొదటికొచ్చిన వ్యాపారం..

వీధి వ్యాపారులు మళ్లీ రోడ్డు పక్కన చేరారు. వారి కోసం రూ.లక్షలు వెచ్చించి చేసిన సముదాయం నిరుపయోగంగా మారింది. నిర్మాణ సమయంలోనే సముదాయంలో సామర్థ్యానికి సరిపడా అమ్మకాలు చేసేలా వ్యాపారులకు కేటాయించి ఉంటే ఘర్షణలు జరగకుండా ఇలా మూతపడే అవకాశం ఉండేదికాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యాపారాలు మళ్లీ మొదటికొచ్చినట్లయింది.

మూన్నాళ్ల ముచ్చటే..



వీధి వ్యాపారులు, కొనుగోలుదారులకు సంతలా ఉంటుందని భావించి ఏర్పాటు చేసిన పట్టణ వీధి వ్యాపారుల సముదాయం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలిపోయింది. ప్రారంభంలో బాగానే అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయి. తర్వాత ఘర్షణలు చోటు చేసుకోవడం.. కొనుగోలుదారులు తగ్గిపోవడంతో సముదాయంపై నమ్మకం పోయి అసలకే మూత పడింది. దీంతో చెత్త నిల్వలకు నిలయంగా మారింది.

– బి.బూబ్, రోటరీనగర్

మూసివేత పెద్ద నష్టం..



పలు కాలనీలకు అందుబాటులో ఉన్న వీధి వ్యాపారుల సముదాయం మూతపడడం వల్ల ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసిన నిర్మాణం చేసిన పనులు వ్యర్థం అయ్యాయి. దీంతో అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు ఉపయోగం లేకుండా పోయింది. అధికారులు చొరవ తీసుకుని వ్యాపారులు ఎవరైనా ముందుకు రాకపోతే ప్రభుత్వ ఇతర అవసరాలకు కేటాయించితే కొంతమేరకైన బాగుటుంది.

– కె.వీరస్వామి, ఆటోడ్రైవర్

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి..



రోటరీనగర్‌లో ఏర్పాటు చేసిన వీధివ్యాపారుల సముదాయంలో ఎక్కువ మందికి అవకాశం కల్పించడంతో నిత్యం ఘర్షణలు చోటుచేసుకునేవి. దీంతో కొనుగోలుదారులు విరక్తి చెంది ఆటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. ఫలితంగా అమ్మకాలు తగ్గి నేడు అసలే మూతపడింది. ఒక వైపు కుక్కల స్థావరం, మరోవైపు మూతపడిన ప్రాంగణంలోని దుర్గంధంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌కె. జాన్‌బీనాగుల్‌మీరా, 9వడివిజన్ కార్పొరేటర్

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి


డీఐఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ మహిళ కళాశాలలో మహిళ అధ్యాపకురాళ్లకు రక్షణ లేకపోవడం బాధాకరమని పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు వి.వెంకటేశ్, ప్రవీణ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మంగతాయి, ఝాన్సీ, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.రమేశ్‌లు అన్నారు. మహిళా అధ్యాపకురాలిని వేధించిన అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యాన డీఐఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధ్యాపకురాళ్లపై గత రెండేళ్లుగా వేధింపులకు పాల్పడుతూ, అసభ్య పదజాలంతో దూషించడం, అసభ్య కవితలతో విద్యార్థినులు, అధ్యాపకుల గ్రూపులలో పోస్ట్ చేయడంలాంటివి చేస్తున్నా ప్రిన్సిపాల్ చర్యలు తీసుకోకుండా, పై అధికారుల దృష్టికి తీసుకుపోకుండా వెనకేసుకురావడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై మహిళా అధ్యాపకులు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టేవరకూ పై అధికారికి తెలయజేయకుండా దాచి ఉంచిన ప్రిన్సిపాల్, సదరు అధ్యాపకుడిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి, మహిళా, యువజన సంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మధు, కౌశిక్, శోభ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై ఆరోపణలు అవాస్తవం..

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఇంటర్ విద్యాఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీపీ గణేశ్, సాధిక్ అలీలు ఒక ప్రకటనలో ఖండించారు. ఓ సంఘం ఆధిపత్యం కోసం ఇలా జరుగుతుందని, వాస్తవాలు తెలియాలంటే విద్యార్థినుల అభిప్రాయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయ హుండీ లెక్కింపు

కామేపల్లి: కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మ తల్లి దేవాలయ హుండీని దేవాదాయశాఖ ఖమ్మం విభాగం పరిశీలకుడు ఆర్.సమత ఆధ్వర్యాన శుక్రవారం లెక్కింపు చేపట్టారు. ఫలితంగా రూ.24,228 వేల ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణాధికారి నల్లమోతు శేషయ్య, చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ బడాటి వరప్రసాద్, పూజారి పుల్లయ్యశర్మ, మోహనకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పనికి రాకుండా మస్టర్లలో పేర్లేంటి?


రఘునాథపాలెంలో నిర్వహిస్తున్న గ్రామసభ

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకం కింద పనికి రాని వారి పేర్లను మస్టర్ల నమోదు చేయడంతో పాటు వారికి పైకం ఎలా చెల్లించారని, పనులకు సంబంధించి కొనుగోలు చేస్తే ఆయా ఏజెన్సీలకు చెల్లించాల్సిన పైకం మీ సొంత ఖాతాల్లో ఎలా జమ చేస్తారు?.. ఇంకుడు గుంతల బిల్లులు ఎందుకు చెల్లించలేదు?.. నాటిన మొక్కలు వేల సంఖ్యలో జాడలేదని తదితర అంశాలపై సామాజిక బృందం తమ తనిఖీల్లో గుర్తించిన వాటిని ఆయా గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో వివరించారు. రఘునాథపాలెంలోని మండల బృహత్తర వనంలో నాటిన లెక్కలకు ఫీల్డ్‌లో ఉన్న లెక్కలకు చాలా తేడా ఉందని 3 వేలకు పైగా మొక్కల జాడలేదని వెల్లడించారు. దీనిపై సమీపంలోనే గుట్టమట్టి తవ్వకాల్లో మట్టిపడి ఆ మొక్కలు చనిపోయాయని పంచాయతీ అధికారులు వివరించారు. అటవీశాఖ ద్వారా నాటిన మొక్కలకు సపోర్టు కర్రల కొనుగోలు ఇతరత్రా సామగ్రి కొనుగోళ్లు చేసిన బిల్లు మొత్తం ఆయా ఏజెన్సీలకు చెల్లించకుండా మీ సొతం ఖాతాకు జమచేయడంపై గుర్తించి ప్రశ్నించారు. గురువారం నాటికి మండలంలోని మొత్తం 40 గ్రామ పంచాయతీలకు 35 పంచాయతీల్లో గ్రామ సభలు పూర్తి కాగా శుక్రవారం మిగిలిన ఐదు పంచాయతీలు రఘునాథపాలెం, చిమ్మపుడి, పాపటపల్లి, కామంచికల్, వీఆర్‌బంజర పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు.

నేడు ఉపాధి పనులపై ఓపెన్ ఫోరం..

మండలంలో గత మూడేళ్లలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించిన అంశాలపై శనివారం రఘునాథపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండల స్థాయిలో ఓపెన్ పోరంలో సామాజిక తనిఖీ బృందం తమ విచారణలో గుర్తించి అంశాలపై వివరించనున్నారు. ఈ సమావేశంలో సంబంధిత విభాగాల అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొంటారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఖమ్మం టౌన్-1 గాంధీచౌక్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మార్వో ఆఫీస్ రోడ్, సాయిరాం థియేటర్ రోడ్, మోతీ నగర్, బొక్కలగడ్డ, పంపింగ్‌వెల్ రోడ్ ఫిల్టర్ బెడ్ ప్రాంతం, ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి ప్రాంతం, గాంధీచౌక్, పీఎస్ఆర్ రోడ్, సుందర్ మ్యాక్స్ థియేటర్ రోడ్, కన్యకా పరమేశ్వరీ దేవాలయం రోడ్, జహీర్‌పుర తండా, వెంకటలక్ష్మి టాకీస్ రోడ్, గాంధీచౌక్ గాంధీనగర్, కొత్త సీతారాములు రోడ్, సుందరయ్యనగర్, పత్తి మార్కెట్ ఏరియా, బోసు బొమ్మ సెంటర్, మంచికంటి నగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఏఈ ఆపరేషన్స్ మాల్విక తెలిపారు.


టౌన్-3 పరిధిలో..

ఖమ్మం టౌన్-3 ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బైపాస్ రోడ్ వేణుగోపాల్ నగర్, విజయనగర్ కాలనీ, బ్యాంక్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, వీడీవోస్ కాలనీ, కవిరాజ్‌నగర్, గట్టయ్య సెంటర్, ప్రశాంతినగర్, వైరా రోడ్, జెడ్పీసెంటర్, కోర్టు, జమ్మిబండ ఏరియాలు, సీక్వెల్ రోడ్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఏఈ ఆపరేషన్స్ బి.తావుర్యా చెప్పారు.

మమత రోడ్డులో..

మమత రోడ్డులో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు మమత రోడ్డు, గొల్లగూడెం రోడ్డు, మధురానగర్, వరదయ్యనగర్, మమత ఆస్పత్రి ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని ఖమ్మంఅర్బన్ సెక్షన్ ఏఈ అశోక్ తెలిపారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు ఖమ్మం విద్యార్థి


అంబికా

ఖమ్మం స్పోర్ట్స్: అండర్-17 పాఠశాలల క్రీడల్లో భాగంగా ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన బాలికల వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో నగరంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బి.అంబికా తెలంగాణ రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించింది. ఈనేపథ్యాన తమిళనాడులో నెల 20 నుంచి 23వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో పాల్గొననుంది. కాగా శుక్రవారం జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహమూర్తి, కోచ్ అక్బర్‌అలీలు అంబికాను అభినందించారు.

మంత్రులు, ఎమ్మెల్యేలకు అభినందనల వెల్లువ..

తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పలువురికి మంత్రి పదవులు అప్పగించగా వారు హైదరాబాద్‌లోని వారి చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈనేపథ్యాన మంత్రి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్కలతో పాటు ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్‌లను పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్


కామేపల్లి: మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్


కూసుమంచి: మంత్రి సీతక్కకు అభినందనలు తెలుపుతున్న నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్


ఖమ్మంవ్యవసాయం: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సన్మానిస్తున్న ప్రతినిధులు

పొంగులేటిపై అభిమానంతో..


పీఎస్ఆర్ అక్షరమాల వరినారుతో కూలీలు

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బోయిన కృష్ణ అనే రైతు పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై తన అభిమానాన్ని చాటుకున్నాడు. తన వరి పొలం నారుమడిలో పీఎస్ఆర్ (పొంగులేటి శ్రీనివాసరెడ్డి) అనే అక్షర మాలగా వరినారును తీయించాడు.

మదినిండేలా పచ్చబొట్టు..

కూసుమంచి: మండలంలోని మంగలితండాకు చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు ఎర్రనాగుల రమేశ్‌నాయక్ తన ఛాతీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రాలను పచ్చబొట్టుగా వేయించుకుని అభిమానాన్ని చాటుకున్నాడు. కాంగ్రెస్ పార్టీకి వీరభిమాని అయిన రమేశ్‌నాయక్ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో 350 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టాడు.

మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువసేన సభ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కి పుట్టినరోజు సందర్భంగా మధుయాష్కి యువసేన, తెలంగాణ యూత్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిశెట్టి అజయ్, పానుగోటి సంపత్ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పోరాడిన ఘనుడు మధుయాష్కి అన్నారు. కాగా ఈ శిబిరంలో 50 మంది రక్తదానం చేయగా.. నాయకులు సయ్యద్ ఆఫ్రీద్ అలీ, ఓజాస్ పాషా, అబ్దుల్ రెహమాన్, ఖాజా హుస్సేన్, సతీశ్, కిశోర్, లోకేశ్, నగేశ్, రవితేజ, నయీమ్, ప్రమోద్, రాకేశ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై శిక్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన సోహం అకాడమీ ఆధ్వర్యాన విద్యార్థులకు రోబోటిక్స్ స్కిల్స్‌పై శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా ముగ్గురు విద్యార్థులకు ఒక్కో హార్డ్‌వేర్ రోబోటిక్ కిట్ ఇచ్చి సొంతంగా తయారు చేసేలా శిక్షణ ఇచ్చారు. అనంతరం నైపుణ్యం ప్రదర్శించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోబోటిక్స్ హెడ్ జశ్వంత్, ఉపాధ్యాయులు వసంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించండి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ గతంలో తెలంగాణను పాలించిన సారథులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పెడచెవిన పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మ్యానిఫెస్టో ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల స్థలం,రూ.10 లక్షల ఆర్థిక సాయం, ఆరోగ్యం, బస్‌పాస్‌లను ఆలస్యం చేయకుండా అందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు అర్వపల్లి సుధాకర్, మారంరాజు రాధాకృష్ణారావు, మోహన్‌రావు, టి.జనార్దన్‌రావు, కల్వకుంట్ల హనుమంతరావు, ఎండీ.ముజాఫరుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

ఖమ్మంరూరల్: ఉపాధి హామీ పనులకు నిధులను కేటాయించడంతో పాటు కూలీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నెకంటి సంఘయ్య కోరారు. శుక్రవారం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, నూతన ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కూలీలకు రోజుకు రూ.600 వేతనంతో పాటు 200 రోజుల పనిదినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మద్ది వెంకటరెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఉపేందర్, వెంకట్రావు, లక్ష్మణ్, మల్సూర్, మురళీకృష్ణ, బాబు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు శాంతివనం ఏర్పాటు చేయాలి

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని రెండు తెలుగు రాష్ట్రాల రాజధాని నగరాల్లో శాంతి వనాలను ఏర్పాటు చేసి కాంస్య విగ్రహాలను నెలకొల్పాలని ఖమ్మం నగర ఆర్యవైశ్య ప్రతినిధులు కోరారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని పీఎస్ఆర్ రోడ్‌లోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించిన సందర్భంగా సంఘం నగర అధ్యక్షుడు గోళ్ల రాధాకృష్ణమూర్తి, తూములూరి లక్ష్మీనరసింహారావు, గుంటుపల్లి దివాకర్ గుప్త, నకిరకంటి సతీశ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షులు పెనుగొండ ఉపేందర్, నరసింహారావు, రవికుమార్, జయరాం , శ్రీనివాస్, వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శోభాయాత్ర

ఖమ్మంగాంధీచౌక్:అయోధ్య రామ మందిర అక్షింతలు, కలశ శోభాయాత్ర శనివారం ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహణ ప్రతినిధులు బోనాల రామకృష్ణ, నేరేండ్ల శ్రీనివాస్, పోలా శ్రీనివాస్, బొడ్డు కృష్ణ, పి.బాలాజీ, పి.రవి, బి.కిశోర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్య నారాయణ సహిత ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు.

మా పోరాటంతో ప్రభుత్వం కళ్లు తెరవాలి..


మాట్లాడుతున్న పడిగ యర్రయ్య

ఖమ్మంఅర్బన్: తమది న్యాయమైన పోరాటం అని, ప్రభుత్వం కళ్లు తెరవాలని గ్రామీణపేదల సంఘం నాయకులు పలువురు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వెలుగుమట్ల (వినోభా నవోదయ కాలనీ)లో గ్రామీణ పేదల సంఘం నగర శాఖ ఆధ్వర్యాన జరిగిన కాలనీ 5వ వార్షికోత్సవ బహిరంగ సభలో వారు మాట్లాడారు. పార్టీ జెండా ఆవిష్కరణను ఇళ్ల స్థలాల కమిటీ అధ్యక్షుడు జంగం రామచంద్రయ్య చేయగా.. అనంతరం జరిగిన సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ ఎర్రయ్య, పార్టీ రాష్ట్ర నాయకుడు పి.ముత్తయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులు దండా లింగయ్య, కుర్మచలం రవీంద్రస్వామి తదితరులు మాట్లాడారు. 2014లో భూదాన్ వారు ప్రొసీడింగ్ ద్వారా స్థలాలను ఇళ్ల స్థలాలు లేనివారికి కేటాయిస్తే 2018 నుంచి నివాసం ఉంటున్నారన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారికి నోటీసులు ఇవ్వలేదని, ఒకవేళ నోటీసులు అందినా తమ న్యాయమైన పోరాటంతో ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. వీరంతా చుట్టుపక్కల గ్రామాల నుంచి వలస వచ్చిన వారేనని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యుడు కల్తి ఎర్రబాబు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో బాణాల లక్ష్మణాచారి, కల్తి రామచంద్రయ్య, షేక్ సొంద్‌మియా, కల్తి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.